# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



### రేవంత్‌కు రైతుల గోస తెలుసా



కాంగ్రెసోళ్ల చెబుతున్న మాటలు నమ్మి ఓటేస్తే రైతులకు మళ్లీ కరెంటు కష్టాలు తప్పవు. రాత్రిపూట పొలాలకు పోవాల్సిన పరిస్థితి వస్తది. మూడు గంటల కరెంటు చాలంటున్న రేవంత్ రెడ్డికి రైతుల సమస్యలు తెలియవు. నాటి కాంగ్రెస్ పాలనలో కరెంట్ సరిగా లేక పంటలు పండక రైతులు అప్పుల పాలయిన్రు. టెన్ హెచ్పి మోటర్లు కొనాలని చెప్తున్నాడు. వాళ్ల మాటలు వింటే రైతులు వ్యవసాయం చేయలేరు. తెలంగాణ ప్రభుత్వంలో రైతులకు మేలు జరుగుతంది. మేమంతా కేసీఆర్‌కు ఓటేస్తాం.

**- గడ్డం అనిల్ రైతు, రేకొండ, చిగురుమామిడి**

### ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతయ్..



మన దగ్గర 10 హెచ్‌పీ మోటర్లతోని వ్యవసాయం చేసేటోళ్లు లేరు. ఆ మోటర్లు వాడితే నారు వేసినప్పుడు వరి నారు కొట్టుకపోతది. అంత పెద్ద మోటర్లతో కరెంటు సరిపోక మన దగ్గరున్న ట్రాన్స్‌ఫార్మర్లు లోవోల్టేజీ సమస్యతో ఎక్కడికక్కడ కాలిపోతయ్. మోటర్లు రిపేరుకొస్తయి. ఇప్పటి కాలంల మూడు గంటల్లో పంటకు నీరందుతదా..? రైతులు ఇబ్బంది పడాల్సి వస్తది. ఇవన్నీ వ్యవసాయంపై అవగాహన లేనోళ్లు చేసే పని. ఆ కాంగ్రెసోళ్లకు ఎద్దు ఎరకనా.. ఎవుసం ఎరుకనా.. అందుకే గిసొంటి మాటలు మాట్లడుతుండ్లు. గిట్ల చేస్తే వాళ్లను బొంద పెట్టుడు ఖాయం. అయిన ఇప్పుడు కేసీఆర్ అందిస్తున్నట్లు రోజు 24 గంటల కరెంటు మంచిగుంది. ఇవన్నీ చూస్తున్నం కదా.. అయిన ఎవరేం చెప్పినా వినిపించుకోం. మాకు 24 గంటల కరెంటు, రైతుబంధు, రైతు బీమా ఇస్తూ ఆసరా అవుతున్న కేసీఆర్‌కే అండగా ఉంటం.

**- పెంద్యాల కేశవరెడ్డి, గుజ్జులపల్లి (కరీంనగర్ రూరల్)**

### రైతులతో కాంగ్రెస్ చెలగాటం



రైతులకు ఇప్పుడు ఫైవ్ హెచ్పీ మోటర్లు సరిపోతున్నయ్. 24 గంటల కరెంటుతో పంటలకు ఏ ఇబ్బంది లేకుండా నీరు అందుతంది. టెన్ హెచ్పీ మోటర్లు పెడితే బావుల్లోని నీళ్లు రెండు గంటల్లో ఖాళీ అవుతాయి. అలాగే టెన్ హెచ్పీకి రూ.70 వేల ఖర్చు అయితది. సీఎం కేసీఆర్ కృషితో వ్యవసాయానికి కరెంట్ అందుతంది. రైతులు ఆర్థికంగా బాగుపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కాంగ్రెస్ వాళ్లు మాయమాటలతో మోసం చేస్తున్నారు. రైతులతో చెలగాటమాడుతున్నరు. వారిని నమ్మం. మళ్లా బీఆర్ఎస్‌నే గెలిపించుకుంటం.

**- గందె సంపత్, రైతు, సుందరగిరి (చిగురుమామిడి)**

### పెద్ద మోటర్లంటే కొద్దిపైసలైతయా?



ఎవుసం గిప్పుడుగిప్పుడే సెట్ అయితంది. గిప్పుడు కాంగ్రెసోళ్లకు ఎవలన్న కరెంటు ఎక్కువైంది. చేంజ్ చేయాలని చెప్పిన్రు. మూడు గంటలేం సరిపోతది. ఈ ఏడేనిమిదేండ్ల సంది మంచిగ నీళ్లు పారిచ్చుకుంటన్నం. గిప్పుడు మల్ల మూడుగంటలు సరిపోతది. పెద్ద మోటర్లు పెట్టుకోవాలంటే ఏంది కథ కొద్దిపైసలైతయా. మల్ల బాయిలకాడ పండేటట్టు చేసేటట్టు ఉన్నరు ఆళ్ల రాజ్యం అత్తే.

**-ఎడ్ల తిరుపతిరెడ్డి, మన్నెంపల్లి (తిమ్మాపూర్)**



### ఇంకా చీకటి రోజులను మరచిపోలే..

ఉమ్మడి రాష్ట్రంల మేం అనుభవించిన చీకటి రోజులను ఇప్పటికీ నేను మరచిపోలే. తాడిజెర్రిలో నాకు మూడెకురాల ఎవుసం భూమి ఉంది. అప్పటి కాంగ్రెస్ సర్కారు 9 గంటల కరెంటు ఇస్తున్నమని చెప్పి కనీసం 3 గంటలు కూడా సక్కగ ఇచ్చిన పాపాన పోలే. ఏ అర్ధరాత్రో కరెంటు ఇచ్చెటోళ్లు. పొలం ఎండిపోకుండా నీళ్లు పెట్టుకుని కాపాడుకోవాలె కాబట్టి కష్టమైనా పొలం వద్దకు వెళ్లేవాళ్లం. రాత్రంతా జాగారం చేసి అరకొరగా వచ్చే కరెంటుతోని పొలానికి పారించడానికి నానా తంటాలు పడెటోళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. తెలంగాణ సర్కారు 24 గంటల కరెంటు ఇస్తుంది. నాకు ఇష్టమచ్చిన టైంల పొలానికి నీళ్లు పెడుతున్న. సర్కారు అంటే కేసీఆర్ సర్కారు లెక్క ఉండాలె.

**- గుండ్రెడ్డి రామిరెడ్డి, వెంకటాయపల్లి(గంగాధర)**

# కాంగ్రెస్‌ను నమ్మితే కరెంట్ ఖతమే..

- ఆ పార్టీకి అవకాశమిస్తే మోటర్లకు మీటర్లస్తయి
- ఉచిత కరెంట్ లేకుంట పోతది
- ఎవుసాన్ని నమ్ముకున్న రైతుల బతుకు ఆగమైతది
- మళ్లీ పాత రోజులు వస్తయి
- బాయిలకాడ జాగారమే అయితది
- ఆ నాయకులను నమ్మనే నమ్మద్దు
- కేసీఆర్‌ను గెలిపించుకుంటేనే మనకు బతుకు
- తేల్చి చెబుతున్న అన్నదాతలు



కరీంనగర్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్‌కు ఓటేస్తే బతుకు దెరువు కరువైతదని, పదేండ్ల కిందటి చీకటి రాజ్యం మళ్లీ వస్తదని జిల్లా రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా కరెంట్ విషయంలో రైతులు పడిన కష్టాలను గుర్తు చేసుకుంటున్నారు. అప్పట్లో ఇచ్చిన కరెంట్‌తో పంటలు పండక నష్టపోయిన తీరును ఇప్పుడు గ్రామాల్లో రచ్చ బండల వద్ద చర్చకు పెడుతున్నారు. రాత్రి పూట కరెంట్ ఇవ్వడం వల్ల రైతులు అర్ధరాత్రి, అపరాత్రి బాయిల వద్దకు వెళ్తే ఎదురైన భయంకర అనుభవాలను మర్చిపోలేక పోతున్నామని చెప్పుకుంటున్నారు. రాత్రి పూట బావుల వద్దకు వెళ్తే పాములు, కరిచి, గుడ్డెలుగుల దాడులకు గుర్రై, ఆఖరికి కరెంట్ షాక్‌లతో చనిపోయిన రైతులను గుర్తు చేసుకుంటున్నారు. ఇప్పుడు వాళ్ల కుటుంబాలు పడుతున్న బాధలను చూసి చలించి పోతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందే మూడు గంటల కరెంట్ ఇస్తామని చెబుతుండటంతో రైతులు తీవ్రంగా ఆగ్రహిస్తున్నారు. ఇలాంటి పార్టీకి అధికారం ఇస్తే నిజంగానే మూడు గంటల కరెంట్ ఇస్తుందనే భయం రైతుల్లో వ్యక్తమవుతోంది. కరెంట్ విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన సంస్కరణలను గుర్తు చేసుకుంటున్నారు. కాంగ్రెస్‌ను నమ్మితే బతుకుదెరువు ఖతమైతదని, బాయిల కాడ నిద్రలు తప్పవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మోటర్లకు మీటర్లు పెడితే భూములు పడావు పెట్టుడేనని చెబుతున్నా. రాష్ట్రంలో ఏ రైతైనా 10 హెచ్‌పీ మోటర్ కొనే పరిస్థితి ఉందా? అని, అంత పెద్ద మోటర్లు, వాటికి అవసరమయ్యే పైపులకు ఖర్చు ఎవరు భరిస్తారని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ వచ్చేదు లేదు.. సచ్చేది లేదుగానీ, పనికిరాని ముచ్చట్లు మాట్లాడుతున్నదని, ఆ పార్టోళ్లను ఎవరూ నమ్మరని స్పష్టం చేస్తున్నారు. ఇప్పుడు పొద్దంతనే అవసరం ఉన్నప్పుడే వెళ్లి కట్క నొక్కితే కరెంట్ వస్తోందని, ఇలాంటి ప్రభుత్వాన్ని కాదని కాంగ్రెస్‌కు ఓటేస్తే తెర్లవుతామనే వాదనలు రైతాంగం నుంచి వినిపిస్తున్నాయి.



### మూల కూడా పారదు

బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక 24 గంటల కరెంటుతో ఎలాంటి రంది లేకుండా పంటలకు నీరు ఇస్తున్నం. మూడు గంటల కరెంటుతో మూలకూడా తడవదు. వ్యవసాయం బందు చేసుకోవాల్సిందే. గత ప్రభుత్వాలు ఇచ్చిన కరెంటుతో ఎన్నో తిప్పలు పడ్డాం. కరెంటు కోసం మోటర్ల దగ్గర పడుకొని, రాత్రి, పగలు కాపలా కాస్తు నీరు పెట్టినం. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక తొమ్మిది సంవత్సరాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటలు పండిస్తున్నం. రైతులు సంతోషంగా ఉన్నారు. మూడు గంటలు కరెంటు ఇస్తమంటున్న కాంగ్రెస్ వద్దే వద్దు. రైతుల కష్టాలు తీర్చే బీఆర్ఎస్ ప్రభుత్వానికే మద్దతిస్తాం.

**- కామెర రేణుక, రైతు, మన్నెంపల్లి (తిమ్మాపూర్ రూరల్)**

### మళ్లీ కరెంట్ కష్టాలొస్తయ్..



కాంగ్రెస్ విధానాలు చూస్తుంటే రైతులు సంతోషంగా ఉండటం ఆ పార్టీ నాయకులకు ఇష్టం లేదనిపిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల కరెంట్‌తో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేదు. ఇప్పుడిప్పుడే పంటలు బాగా పండి ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నం. ఈ సమయంల రైతులకు మూడు గంటల కరెంట్ ఇస్తే మళ్లీ కష్టాలు మొదలైతయ్. కాంగ్రెసోళ్ల పిడుగులాంటి వార్తతో నిద్ర కూడా సక్కగ వస్తలేదు. పాత రోజులను తలుచుకుంటునే భయమేస్తోంది. అప్పుడున్న కరెంట్ కష్టాలతో రైతులు వ్యవసాయం చేయడానికి కూడా వెనుకడుగు వేసిన్రు. కరెంట్ ఉంటే నీళ్లు ఉండవు.. నీళ్లు ఉంటే కరెంట్ రాకపోవు. రైతులకు మేలు చేయాల్సిన కాంగ్రెస్ నాయకులు మూడు గంటల కరెంట్ అని చెప్పి కీడును చేసేలా ఉన్నరు. ఒక్క రైతు కూడా కాంగ్రెస్‌కు ఓటు వేయడు. ఇది నిజం.

**- ఎస్ కనుకయ్య, కొండాపూర్, కొత్తపల్లి**

### మళ్లీ గోస పెడుతే తరిమికొడుతం



10 హెచ్‌పీ మోటర్లతో రైతులకు లక్షల రూపాయల ఖర్చయితది. మూడు గంటల కరెంట్ సరిపోతుందని కాంగ్రెస్ నాయకులు అనడం చూస్తే వారికి ఎవుసంమీద ఏ మాత్రం అవగాహన లేదని అర్థమైతంది. అందుకే ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నరు. 10 హెచ్‌పీ మోటర్లతో ఒక్కసారిగా లోడ్ పెరిగి ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోయి మళ్లీ పంటలు ఎండబెట్టుకునే పరిస్థితి ఏర్పడుతుంది. గతంలో వేళాపాల లేని అరకొర కరెంట్‌తో తరచూ మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయి ఎంతో గోస పడ్డం. ఒకవేళ మోటరు కాలిపోతే పది వేల ఖర్చయితది. 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటర్లతోనే రైతులకు మేలు. కాంగ్రెసోళ్లు చెప్పినట్లు 10 హెచ్‌పీ మోటరు పెడితే బాయిల నీళ్లు తొందర ఖాళీ అయితయ్. కరెంట్ భారం పడుతది. దానిని తిరిగి రైతులపైనే వేస్తరు. కాంగ్రెస్ వచ్చేది లేదు.. సచ్చేది లేదు గానీ, రైతులను మళ్లీ గోసపెట్టాలని చూస్తున్నది. అలా చేస్త ఆ పార్టీని తరిమికొట్టాల్సి వస్తది. రైతుల పక్షాన ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి అండగా ఉంటం.

**-మునిగంటి శ్రీధర్‌రెడ్డి, రైతు, (పరకాలక్రాస్ రోడ్, హుజూరాబాద్‌టౌన్)**



### కాంగ్రెసోళ్లకు తలెర్కనా.. తోకెర్కనా..

గతంలో కరెంట్ ఇబ్బందులు చాల అనుభవించనం. రోజుకు మూడు గంటలు ఇస్తే, కనీసం 3 ఎకరాల కూడా సాగదు. ఇప్పుడు గ్రామంలో నడుస్తున్నయన్నీ 3 హెచ్‌పీ మోటర్లే. నీళ్ల పారకం దూరముంటేనే రైతులు 5 హెచ్‌పీ మోటర్లు వాడతరు. చివరికి మామిడితోట, వంటి వాటికి సైతం 7 హెచ్‌పీ మోటర్లు వాడతలేరు. 10 హెచ్‌పీ అయిత డబుల్ స్టాటర్లు తెచ్చుకోవాలి. కెపాసిటీ పెంచి కనెక్షన్లు తీసుకోవాలి. పైపులు మార్చలి. మస్తు ఖర్చు అయితది. రైతుల గివన్నీ చేస్తరా.. ఇవన్నీ అయ్యే పనేనా.. మూడు గంటలు, 10 హెచ్‌పీ మోటర్లు అంటే వ్యవసాయం అంటే తెలవనోళ్లు మాట్లాడే మాటలు. కాంగ్రెసోళ్లకు తలెర్కనా.. తోకెర్కనా.. అయినా ఇప్పుడు కేసీఆర్ ఇస్తున్న కరెంటు మంచిగుంది. మళ్ల ఎనుకటి లెక్క సేతమనుడు ఏంది. నాడు అరిగోస పెట్టిన కాంగ్రెస్ మళ్లీ ఇప్పుడు మాయమాటలు చెబుతున్నది. అధికారంలోకి వచ్చేది లేదు.. సచ్చేది లేదు కానీ, రైతులను ఆగం చేస్తున్నది.

**- కొల్లూరి మల్లారెడ్డి, చెర్లభూత్కూర్ (కరీంనగర్ రూరల్)**

### మళ్లీ గొడవలు పెట్టిస్తరా?

ఎన్కటి రోజులు ఎనకట్నే ఉన్నయి. అప్పటిలెక్క ఉంటా అంటే ఎట్ల. ఏరోజుకారోజు ముందడికి పోవాలే కని ఎన్కకు పోతమా..? అప్పుడు నిజాం కాలం నాటి రికార్డులు. అవ్వీ గట్లనే ఇంకా రాత్తమంటే ఇప్పుడు చెల్లుతయా. కేసీఆర్ సారు ఇప్పటికీ దగ్గట్టు మంచిగా అన్ని రకాల ఆలోసించి ధరణి పెట్టిండు. ఇప్పట్ల ఎసంటోళ్లు ఉన్నరు దొంగలు. పక్కోనికి తెలువకుండా భూమి మాయం చేత్తరు. ఈ ధరణి రాకముందు అట్ల యినయి కూడా ఊళ్లల్ల. ఇంత మంచిగా ఉన్న ధరణిని తీసేసి భూమిని దోచుకునే టోల్లకు అప్పగించినట్లయితది. పంచాయితీలు పెరుగుతయి. అట్లనే మల్ల ప్రభుత్వం ఇచ్చే రైతుబంధు, బీమా ఎట్లయితయి. ఆ కాంగ్రెసోళ్లు గంతే..ఏదో నోటికచ్చినట్టు మాట్లాడుతరు.

**- పబ్బాల రాజయ్య, రైతు, పర్లపల్లి (తిమ్మాపూర్)**



### ధరణి వద్దన్న కాంగ్రెస్ మాకద్దు

కాంగ్రెసోల్ల అప్పుడు తహసీల్దార్ కార్యాలయం చుట్టు తిరిగి విసిగి వేజారిపోయినం. పట్వారీ ఉంటే, గిర్దవార్ ఉండరు. వారిద్దరు ఉంటే తహసీల్దార్ విచారణ రిపోర్టులని కాలయాపన చేస్తుండే. ఇప్పుడు వ్యవసాయ భూమి కొనుగోలు చేసి, అమ్మిన వెంటనే మార్పులు జరుగుతున్నయి. పట్టాదారు పాసు పుస్తకాలు వెంటనే ఇంటికే పోస్టులో వస్తున్నయి. గతంలో కబ్జాకాలం, పట్టాదారు కాలం వలన, కబ్జా నుంచి పట్టాదారు కాలంలోకి వచ్చే వరకు యేండ్లు అయ్యేటిది. భూ మాత పేరున పాత పద్ధతి తీసుకొస్తే, మాకు తిరిగి పాత సమస్యలతోపాటు, ఇప్పుడు వచ్చే కౌలుదారు పేరు వలన, మరిన్నీ సమస్యలొస్తయి. పాత పద్ధతి కంటే, ప్రస్తుతం ఉన్న ధరణితో రైతులకు లాభం. అసలు ధరణి వద్దన్న కాంగ్రెస్సే మాకద్దు.


**- గుజ్జుల రాఘవ రెడ్డి, చెర్లభూత్కూర్(కరీంనగర్ రూరల్)**



### పైరవీకారుల రాజ్యమే

నాకు 10 ఎకరాల భూమి ఉంది. గతంలో పటేల్ పట్వారీ వ్యవస్థ కాలంలో డబ్బులకు ఆశ పడి దొంగ రిజిస్ట్రేషన్లు చేసిన్రు. రెవెన్యూ రికార్డుల్లో తప్పులు చేస్తూ రైతులను మోసం చేసే వాళ్లు. రికార్డుల్లో తప్పులు జరుగకుండా ఉండేందుకు సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్ తీసుకువచ్చిన్రు. ఏ అధికారులతో సంబంధం లేకుండా మాకే అవకాశం కల్పించిన్రు. కాంగ్రెస్ మళ్లీ పాత పద్ధతిలో ఉండేలా అన్ని కాలాలను పెడతామంటంది. అట్లయితే మళ్లీ మొదటికి వస్తది. పైరవీకారులు రాజ్యమేలుతరు. ఎట్టి పరిస్థితిల కాంగ్రెస్‌ను రానిచ్చేదే లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వమే రావాలి. ధరణి పోర్టల్‌ను కొనసాగించాల్సిందే..

**-చింతిరెడ్డి మల్లారెడ్డి, రైతు, చిన్నకోమటిపల్లి (ఇల్లందకుంట)**



- రద్దు చేస్తమన్న కాంగ్రెస్‌ను మేమే రద్దు చేస్తం
- ఆ పార్టీకి ఈ ఎన్నికల్ల తగిన బుద్ధి చెబుతం
- భూములకు భద్రత కల్పించిన కేసీఆర్‌కే ఓటేస్తం
- బీఆర్ఎస్‌ను కాపాడుకుంటం
- స్పష్టం చేసిన జిల్లా రైతులు

# ధరణి జోలికొస్తే.. ఊరుకోం

కరీంనగర్, నవంబర్ 25(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : బీఆర్ఎస్ కాకుండా ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తమ భూములకు భద్రత లేకుంటా పోతదని, తిరిగి గతంలో అనుభవించిన బాధలు మొదలవుతాయని జిల్లా రైతులు స్పష్టం చేస్తున్నారు. ఎన్నో రోజులు కష్టపడి, అనేక వ్యయప్రయాసలకు ఓర్చుకుని కొత్త రెవెన్యూ చట్టం తెచ్చి తమ భూములకు భద్రత కల్పించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేస్తున్నారు. ఒకప్పుడు తమ భూములకు సంబంధించిన హక్కులు, అధికారాలు ప్రభుత్వం చేతిలో ఉండేవని, కొత్త చట్టం వచ్చిన తర్వాత ఏర్పడి ధరణి కారణంగా ఇప్పుడు తమ భూములపై తమకే అధికారం వచ్చిందని అభిప్రాయపడుతున్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణిని తీసి బంగాళాఖాతంలో పడేస్తామని కాంగ్రెస్ నాయకులు చెప్పే విషయాలపై రైతులు తీవ్రంగా ఆగ్రహిస్తున్నారు. ధరణి ఉండడం వల్లనే ఈ మూడు నాలుగేళ్ల నుంచి భూముల గొడవలు తగ్గాయని అంటున్నారు. యాభై ఏండ్లకు పైగా పాలించిన కాంగ్రెస్ ఇంత మంచి ఆలోచన ఎందుకు చేయలేక పోయిందని ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవస్థను రద్దు చేయాలని కాంగ్రెస్ నాయకులు చెప్పిన మరుక్షణమే ఆ పార్టీకి పుట్టగతులు లేకుండా పోయాయని చెబుతున్నారు. ధరణిని తొలగిస్తామని చెప్పే కాంగ్రెస్ పార్టీకి గట్టి బుద్ధి చెప్పక తప్పదని హెచ్చరిస్తున్నారు.

### పాత పద్ధతి వస్తే పట్టాదారులకు ఉరే..



తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అనేక పథకాలు తీసుకువచ్చింది. ప్రభుత్వం ఇస్తున్న 24గంటల కరెంట్, రైతుబంధు పథకంతో అన్నదాతలు ఎంతో సంతోషంగా ఉన్నారు. ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్ అద్భుతంగా కొనసాగుతున్నది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కౌలు రైతుల కోసం చట్టం తీసుకొస్తామని చెప్పడం పట్టాదారుల రైతుల్లో భయాన్ని కలిగిస్తున్నది. కాంగ్రెస్ నాయకులు తీసుకువస్తామంటున్న ఈ చట్టం పట్టాదారుడికి మధ్య, కౌలు రైతుల మధ్య దూరాన్ని పెంచుతుంది. కౌలు రైతుల ఒప్పంద చట్టంతో అనేక భూ సమస్యలు తలెత్తడమే కాకుండా కోర్టుల వరకు వెళ్లాల్సి వస్తుంది. చట్టం అమలులోకి వస్తే పట్టాదారులు వ్యవసాయం మానేస్తారే కానీ, కౌలు రైతులకు ఒప్పందం చేయడానికి ససేమిరా ఒప్పుకోరు. ఒకవేళ కౌలు ఒప్పందాలు చేసినా తర్వాత భూమిపై హక్కులు కోల్పోతామనే భయం పట్టాదారుల్లో ఉన్నది. గ్రామంలో మాకు ఉన్న పొలాన్ని తాతల కాలం నుంచి కౌలుకి ఇస్తున్నామే కానీ, ఇప్పటి వరకు ఎలాంటి ఒప్పందాలు చేసుకోలేదు, వారితో ఎలాంటి సమస్యలు రాలేదు. కాంగ్రెస్ నాయకులు చెబుతున్న కౌలు చట్టంతో పట్టాదారుడి రైతుల భూములకు రక్షణ కరువైతది. కౌలు రైతుల చట్టాన్ని పట్టాదారులు ఎవరూ అంగీకరించారు. కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో రైతులు, పట్టాదారులు ఎవరు ఓటు వేయరుగాక వేయరు.

**-మూగల సమ్మిరెడ్డి, రైతు, పెద్దపాపయ్యపల్లి(హుజూరాబాద్‌టౌన్)**

### కాంగ్రెస్‌ను నమ్మితే మళ్లీ అరిగోసలే..



మునుపు మా బాపు నాకు భూమి రిజిస్ట్రేషన్ చేపిస్తనంటె హుజూరాబాద్ రిజిస్ట్రేషన్ ఆఫీసుకు వెళ్లినం.. అక్కడ ఓ రోజు స్లాట్ బుక్ చేసినం.. పది రోజుల తర్వాత రమ్మంటే మళ్లీ వెళ్లినం.. చేతులు తడిపితేనే రిజిస్ట్రేషన్ చేసింద్రు.. ఇగ పేపర్లు వచ్చినంక ఆర్‌వోఆర్ పట్టా మార్పిడి చేసుకోడానికి ఎమ్మార్వో ఆఫీసుకు వెళ్లినం.. అప్పుడు మాకు చుక్కలు చూపిచ్చింద్రు.. దరఖాస్తు పెట్టినంక పట్వారీ నెలల కొద్ది తిప్పిచ్చిండి. ఆ పేపర్.. ఈ పేపర్ అడిగి అరితోస పెట్టిండు. అడిగిన పైసలు ముట్టజెప్తేనే పట్టాకు ఎక్కిచ్చిండు.. ఆ గోసలు అన్నీ ఇన్నీ కావు.. ధరణి వచ్చినంక అసోంటి కష్టాలు అన్నీ పోయినయ్. ఒకటే దగ్గర రిజిస్ట్రేషన్ నిమిషాలల్లో పూర్తయితంది. ఎవరికీ రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదు. ఎవరి పైరవీ అక్కరలేదు. పడిగాపులు గాయాల్సిన పనిలేదు. ధరణితోటి రైతులకు మంచి సౌలత్ అయింది.. కాంగ్రెసోళ్లు వచ్చేది లేదు.. సచ్చేది లేదు గానీ, ధరణి రద్దు చేస్తామంటన్నరు. మళ్లీ పాత పద్ధతి తెచ్చి మమ్మల్ని గోస పెట్టాలని చూస్తున్నరు. వాళ్లను నమ్మేదే లేదు. వాళ్లను ఊళ్లల్లకు రానిచ్చేదే లేదు. భూములకు భద్రత ఇస్తున్న ధరణిని, బీఆర్ఎస్ సర్కారును కాపాడుకుంటం.

**-కొత్త భగవాన్‌రెడ్డి, రైతు, తాడికల్ (శంకరపట్నం)**

### మమ్మల్ని ఇబ్బంది పెడితే ఊరుకోం..



ధరణితో రైతుల సమస్యలు తీరినయ్. ఇప్పుడు రైతుల వారీగా భూముల లెక్కలు తేలాయి. ధరణితో రిజిస్ట్రేషన్ ఈజీగా అవుతున్నది. రైతుబంధు పడుతున్నది. ఇగ ధరణితీసేసి అనుభవదారు కాలం, కాస్తుకాలం లాంటివి పెట్టాలని చూస్తున్నరు. అట్లాంటి వాటితో రైతులకు ఇబ్బందులుంటయ్. ఇప్పుడు ధరణితో కొత్తపాసుబుక్‌లు వచ్చి రైతులంతా ప్రశాంతంగా ఉన్నరు. కాంగ్రెసోళ్లు ఇంకోదే పెట్టి రైతులను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నది. అలా చేస్తే ఊరుకునేది లేదు.

**- దుంపేటి ఆంజనేయులు, రైతు, వెన్కెపల్లి(సైదాపూర్)**


### పట్వారీలు వస్తే మళ్లీ తిప్పలే



ఆచంపల్లిలో నాకు నాలుగెకురాల భూమి ఉంది. ధరణి వచ్చినంక నా భూమి ఆన్‌లైన్‌లో ఎక్కింది. గతంల ఇట్ల లేకుండె. భూములు అమ్ముడు ఓ ఆఫీసుల, మళ్లీ మా పేరు మీదికి మార్పిడి చేసుకునుడు ఓకాడ ఉండేది. దీంతోని భూమిని మార్పిడి చేయడానికి మస్తు కట్టమైంది. పట్వారీల చుట్టూ తిరిగీ తిరిగి చెప్పులు అరిగినియ్. మాకు తెలియకుండనే మా భూములు వేరేటోళ్ల పేరుమీద ఎక్కేవి. కేసీఆర్ సారు ధరణి తెచ్చినంక భూములు వ్యవస్థ మంచిగున్నది. ధరణి పోతే భూముల లెక్కే ఉండది. అట్ల కానియ్యం.

**- పర్నె గోపాల్‌రెడ్డి, చిన్నాచంపల్లి (గంగాధర)**

### రాబంధులకిస్తే రావణ కాష్టమే..



తెలంగాణ వచ్చినంక సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చాడు. ఇప్పటికే రికార్డులు పూర్తి చేశారు. ఒకవేళ కాంగ్రెస్ అధికారంలోకొస్తే రికార్డుల్లో లేని భూములు కనబడవు. ప్రభుత్వ, ఆలయాల భూముల మటాష్. కాంగ్రెస్ హయంలో ఎన్నో భూములు కబ్జాకు గురైనయి. వాళ్ల అనుచరులు భూబకాసురులుగా మారి, న్యాయంగా ఉన్న పట్టాదారులకు భూమి చెందకుండా చేసింద్రు. ఆధారాలు లేకుండా ఉంటే ఆ భూములు కబ్జాకు గురైతయి. రాబంధులకిస్తే తెలంగాణ రావణ కాష్టమే. ధరణి తీసేస్తే కోర్టుల్లో భూతగాదాల కేసుల సంఖ్య పెరుగుతుంది.

**- పారిపెల్లి శ్రీనివాస్ రెడ్డి, రైతు,గంగిపల్లి (మానకొండూర్ రూరల్)**


జాతీయ న్యాయ దినోత్సవ శుభాకాంక్షలు

గత 31 సంవత్సరాలుగా మా ఉన్నతికి సహకరించిన మా కక్షిదారులకు, మా శ్రేయోభిలాషులకు మరియు న్యాయమూర్తులకు, మా తోటి న్యాయవాదులకు, జాతీయ న్యాయ దినోత్సవ శుభాకాంక్షలు...



బొద్ల శ్రీనివాస్ B.A.,LL.B. Advocate

బొద్ల గీతారాణి B.Com.,LL.M. Advocate

బొద్ల నిహారిక B.B.A, LL.B, (Symbiosis) LL.M (London) Advocate

ఇ.నెం. 2-9-36, "గీతా-శ్రీనివాసం" పాత కూరగాయల మార్కెట్ రోడ్, ముకరాంపుర, కరీంనగర్. మొబైల్: 9440082034